క్లుప్తంగా

సోమశిల జలాశయ పరిశీలన



సోమశిల: సోమశిల జలాశయాన్ని కృష్ణా నది మేనేజ్‌మెంట్ బోర్డుకు చెందిన డీఎం రాయ్‌పురే బుధవారం సందర్శించారు. నీటిమట్టం, క్రస్ట్ గేట్లు, ఎస్‌కేఎఫ్‌ఎఫ్‌సీ కెనాల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గేట్ల మరమ్మతులు, కండలేరు కాలువ లీకేజీలు, ఆప్రాన్ పనులపై అందిన నివేదిక ప్రకారం ప్రభుత్వ ఆదేశాలతో జలాశయాన్ని పరిశీలించామన్నారు. ప్రాజెక్ట్ అభివృద్ధి, మరమ్మతులపై ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, డీఈ రవీంద్ర ప్రసాద్, ఈఈ దశరథరామిరెడ్డి, జేఈఈ రామ్మోహన్‌రెడ్డి, నిఖిల్, జలాశయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ

మర్రిపాడు: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను అందజేస్తోందని ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ బుధవారం తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు కలిగిన బీసీ మహిళలు అర్హులని చెప్పారు. 75శాతానికి పైగా హాజరుతో పూర్తిస్థాయి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, కుట్టుమెషీన్లను సైతం అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు

కావలి: కావలి నియోజకవర్గంలోని మమిడి, మిరప తోటలను కావలి ఉద్యాన అధికారిణి ఎం సుధామయి బుధవారం పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలను సూచించారు. మిరప, మామిడి తోటలను నల్ల తామర పురుగులు ఆశించి ఉన్నాయని, తొలి దశలో నియంత్రించకపోతే దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. నల్లతామర నివారణకు కానుగ సోపు 7.5 గ్రాములు లేదా అజాడిరాక్టిన్ 3000పీపీఎం 3 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నీలం, పసుపు జిగురు అట్టలను చెట్ల మధ్యన ఉంచడం ద్వారా ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. తామర పురుగు నివారణకు లీటర్ నీటికి థయామెథాక్సామ్ 25 శాతం 0.5 మి.లీ లేదా ప్రొఫినిల్ 1.5–2 గ్రాములు లేదా స్పినోసాడ్ 0.3 మి. లీను మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. మామిడిలో తేనె మంచు పురుగు నివారణకు లీటర్ నీటికి బుప్రొఫెజిన్ 2 మి.లీ లేదా పిమెట్రోజైన్ 0.6 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు.

ఆటో బోల్తా–ముగ్గురికి గాయాలు



సీతారామపురం : మండలంలోని గంధంవారిపల్లి సమీపంలో జాతీయరహదారిపై బుధవారం ఓ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు.. చిన్నాగంపల్లి నుంచి సీతారామపురానికి ప్రయాణికులతో బయల్దేరిన ఆటో గంధంవారిపల్లి ఇటుక బట్టీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలోని బోడసిద్ధాయపల్లికి చెందిన మాలపాటి రంగయ్య, పబ్బులేటిపల్లికి చెందిన భాగ్యమ్మ, గంధంవారిపల్లికి చెందిన లక్ష్మీదేవి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో గృహాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

ఆత్మకూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి ఆర్టీసీ సర్వీసులను నడుపనున్నట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ కరిమున్నీసా బుధవారం తెలిపారు. అనుమసముద్రంపేట మండలం గుడిపాడు నుంచి ఉదయం 7.15 గంటలకు బయలుదేరే బస్సు 7.45 గంటలకు టిడ్కో గృహాలకు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని 8 గంటలకు ఆత్మకూరుకు చేరుతుందన్నారు. అలాగే సాయంత్రం 5.15 గంటలకు ఆత్మకూరు నుంచి బయలుదేరే బస్సు టిడ్కో గృహాల వద్దకు చేరుకుని నెల్లూరు వెళ్తుందని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

అల్లూరు: గృహలబ్ధిదారులు నిర్మాణాలను వేగవతం చేయాలని మండల గృహ నిర్మాణశాఖ ఏఈ వెంకటేశ్వర్లు సూచించారు. మండల గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేయబడిన, కొత్తగా మంజూరు చేయనున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు రూ.1.80లక్షలతో పాటు అదనంగా ఎస్టీలకు 75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పున మంజూరు చేస్తూ జీఓను జారీ చేసిందని తెలిపారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



కావలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కావలి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తన నివాస ప్రాంగణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తోందన్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం నిరంతరం పరితపించే నాయకుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం

ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని మేకపాటి కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ మహిళా కన్వీనర్, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు, రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి, కక్ష పూరిత రాజకీయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అనంతరం ఇటీవల పార్టీ పదవులు పొందిన పలువురు నాయకులను పట్టణాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పార్టీ కండువాలతో సత్కరించారు. జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పులిమి రమేష్‌రెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, నందా ఓబులేసు, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, నందవరం ప్రసాద్, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, వెంగళరెడ్డి, మైనార్టీ నాయకులు సయ్యద్ జమీర్, జమ్రు, కలాం, మహిళా నేతలు కల్పన, కొప్పోలు వెంకటేశ్వర్లు, ఎన్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరిలో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, కల్లూరి రమణారెడ్డి, మూలె అక్కుల్‌రెడ్డి, గడియాల్చి యస్దాని, శ్రీనివాసులురెడ్డి, రాజమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల్లో అసమర్థ ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల తరుపున పోరాటం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వేలమూరి శ్రీధర్‌రెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, వేలమూరి చైతన్యరెడ్డి, దేవరపల్లి శివారెడ్డి, వేలమూరి శ్రీనివాసులరెడ్డి, తుమ్మల శ్రీనివాసుల రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిస్తోందన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో నెల్లూరులో జరిగిన యువతపోరు కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాగంటి శ్రీనివాసులు, దారపనేని చెన్నారాయుడు, ప్రభాకర్‌రెడ్డి, బి.రత్నం, ఎం.తిరుపతయ్య, జి.భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జలదంకి: బ్రాహ్మణక్రాకలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



వరికుంటపాడులో పార్టీ జెండా ఆవిష్కరణ



ఉదయగిరిలో స్వీట్లు పంచుకుంటున్న నాయకులు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలికొండ పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పీహెచ్‌సీకి అవసరమైన మౌలిక వసతులపై కమిటీ సభ్యులు చర్చించారు. నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వైద్యులు మురళీకృష్ణ, ఎంపీఈఓ శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సోమశిల: అనంతసాగరం మండలం గోవిందంపల్లికి చెందిన బాలిక అదృశ్యంపై తల్లిదండ్రులు సోమశిల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన శ్రీను కుమార్తె హర్షిత మంగళవారం ఉదయం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఎంత వెతికిన బాలిక ఆచూకీ తెలియకపోవడంతో సోమశిల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై అనూష తెలిపారు. బాలిక ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

యువత పోరుకు తరలిన నాయకులు

కలిగిరి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో బుధవారం నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలసి కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరుకు తరలి వెళ్లిన వారిలో ములకా శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని వెంకట సత్యనారాయణ, అక్కెం హజరత్‌రెడ్డి, మస్తాన్ రెడ్డి, మహేష్‌రెడ్డి, రమణారెడ్డి, కూనిపోగు ఇరిమ్మయా, తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా గరుడ వాహన సేవ

- కిటకిటలాడిన బిలకూట క్షేత్రం
- ఉదయం నుంచే పోటెత్తిన భక్తులు



గరుడ వాహనంపై ప్రసన్నుడు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ వాహనసేవను బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనసేవను భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందనే నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు.

కిటకిటలాడిన బిలకూట క్షేత్రం

గరుడవాహన సేవకు భక్తులు భారీగా తరలిరావడంతో బిలకూట క్షేత్రం కిటకిటలాడింది. ఉదయం నిర్వహించిన మోహినీ ఉత్సవం నుంచే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. గరుడసేవకు ఊహించని స్థాయిలో భక్తులు తరలిరావడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. కొండ దిగువన వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు స్వల్ప ఇబ్బంది నెలకొంది.

మోహినీ అవతారంలో ప్రసన్నుడు

ప్రసన్నుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం మోహినీ ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలకు నాందీగా స్వామివారు మోహినీ అవతారంలో పండితుల వేద మంత్రాలు, శుభకర మేళతాళాలు, గోవింద నామ స్మరణలను ఆస్వాదిస్తూ పాలకడలి నుంచి ఆవిర్భవించిన అమృతభాండంతో భక్తులకు జ్ఞానామృతాన్ని పంచుతూ కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల్లో ఊరేగారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మోహినీ అవతారంలోని స్వామివారిని దర్శించుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మొక్కుబడులు, సాయంత్రం తెప్పోత్సవం, గజవాహనసేవ జరుగుతాయని అర్చకులు తెలిపారు.

పట్టపగలే చోరీ



పారిపోతున్న దొంగ

కావలి: పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులోని ఓ ఇంట్లో పట్టపగలే దొంగ చోరీకి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు..తుమ్మలపెంటరోడ్డులో ఉపాధ్యాయ దంపతులు తన్నీరు వసంత రావు, అంజనాదేవి నివాసం ఉంటున్నారు. వారు ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి తాళాలు వేసుకుని పాఠశాలలకు వెళ్లారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి కొద్దిసేపు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించారు. ఆ తరువాత ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు 85 గ్రాముల బంగారు నగలు చోరీ చేశాడు. కాగా దొంగ ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా స్థానికంగా ఉండే ఓ వ్యక్తి గుర్తించి వీడియో తీయడంతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను పట్టుకునేందుకు విఫలయత్నం చేశారు. దొంగ దొరక్కపోవడంతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా సరస్వతి పూజ

సీతారామపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, గౌతమి స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులు సరస్వతి పూజను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులను ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం ప్రాంతీయ కమిటీ సమావేశం

ఉదయగిరి: పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సీపీఎం ప్రాంతీయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో తగినంత మంది వైద్య సిబ్బంది లేకపోవడంతో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ఉదయగిరిలో కళాశాల విద్యార్థుల కోసం వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు, అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మా ప్రభుత్వం.. మా ఇష్టం

- ఇసుక రీచ్‌లో టీడీపీ నాయకుల దందా
- ఇసుక లోడింగ్ చేసే కూలీల నుంచి నగదు వసూలు
- వ్యతిరేకించిన వారిపై దౌర్జన్యం
- పోలీసులకు కూలీల ఫిర్యాదు



ఆత్మకూరు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కూలీలు



అప్పారావుపాళెం ఇసుక రీచ్‌లో ట్రాక్టర్‌కు ఇసుక లోడింగ్ చేస్తున్న కూలీలు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మా ప్రభుత్వం..మా ఇష్టం అంటూ సహజ వనరులను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం ఇసుక ఫ్రీ అంటూ ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకులు రీచ్‌లను తమ గుప్పెట్లో పెట్టుకుని దోచుకుంటున్నారు. ఇసుక రీచ్‌ల్లో ఇసుక లోడ్ చేసే కూలీలను సైతం వదలడం లేదు. వారి నుంచి నగదును వసూలు చేస్తున్నారు. ఎవరైనా వ్యతిరేకిస్తే దౌర్జన్యం చేస్తున్నారు. లోడింగ్ పని ఇవ్వకుండా నిరాకరిస్తున్నారు. ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలోని పెన్నానది ఇసుక రీచ్ వద్ద సాగుతున్న ఈ దందా కూలీలు, వారి నగదు వసూలు చేసే వారి మధ్యన బుధవారం సాయంత్రం గొడవ చోటు చేసుకుని పోలీసు స్టేషన్‌కు పంచాయతీ చేరడంతో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. అప్పారావుపాళెంలోని దళితకాలనీ సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌లోకి కాలనీ మీదుగా దారి ఏర్పాటు చేశారు. స్థానిక టీడీపీ నాయకుడి మద్దతుతో ఓ కుటుంబం వారు రీచ్‌లోకి సీరియల్ నంబర్లు ఇస్తూ ట్రాక్టర్లను పంపించడం, వాటికి లోడ్ చేసేందుకు స్థానికంగా ఉన్న మహిళలు, పురుషులను బ్యాచ్‌లుగా పంపడం చేస్తున్నారు. కాలనీలో మొత్తం 24 బ్యాచ్‌లు ఉండగా, ఒక్కో బ్యాచ్‌లో ముగ్గురు నుంచి ఎనిమిది మంది వరకు ఉన్నారు. కాగా ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేసే పనులకు తమకు అనుకూలంగా ఉండే వారికే ఎక్కువ అవకాశం కలిప్తున్నారు. ఇందుకు ఒక్కో బ్యాచ్ వద్ద రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా 24 బ్యాచ్‌ల నుంచి రోజుకు రూ.1200 వరకు సదరు నాయకుడి మనుషులు వసూలు చేస్తున్నారు. ఈ తంతూ గత మూడు నెలలుగా సాగుతోంది. దీనిని ఎవరైనా వ్యతిరేకిస్తే ' మా ప్రభుత్వం.. మా నాయకుడు చెప్పినట్టే నడవాలని' దౌర్జన్యానికి పాల్పడుతూ వారికి లోడ్ చేసే అవకాశం ఇవ్వటంలేదు. దీంతో బతుకుదెరువు పోతుందేమోనని కూలీలు సర్దుకుపోతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కొందరికే లోడ్ చేసే అవకాశం ఇవ్వడం, ఇతరులకు ఇవ్వకపోవడంతో మిగిన బ్యాచ్‌ల వారు తాము రూ.50 చొప్పున నగదు ఇవ్వమని తెగేసి చెప్పారు. ట్రాక్టర్లను సైతం నిలిపివేశారు. ఈ క్రమంలో నగదు వసూలు చేసే కుటుంబానికి చెందిన వ్యక్తి మద్యం మత్తులో బూతులు తిడుతూ మహిళలపై దౌర్జన్యానికి దిగాడు. భయపడిన మహిళలు, కొందరు పురుషులు ఆత్మకూరు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఎస్సై షేక్ జిలానీకి ఫిర్యాదు చేశారు. ఆయన విచారణ చేస్తామని తెలిపారు. కాగా ఈ విషయమై తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఉచిత ఇసుక పాలసీ అమల్లో ఉందని, ఎంట్రీపాస్ అంటూ ఎవ్వరికీ నగదు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులను రీచ్ వద్దకు పంపించి అలాంటి వాటిని నిలిపివేస్తామన్నారు.

15న అగ్రిగోల్డ్ భూములను పరిశీలించనున్న కాకాణి



పార్టీ నాయకులతో చర్చిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: వరికుంటపాడు మండలం కనియంపాడులోని అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూములను ఈ నెల 15న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించనున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నెల్లూరులో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్‌ను అక్రమంగా నరికి కొంతమంది నేతలు సొమ్ము చేసుకున్న నేపథ్యంలో కాకాణి క్షేత్రస్థాయిలో అక్రమాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం రెవెన్యూ, పోలీసు అధికారులను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కాకాణి పర్యటనలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మర్రిపాడు: విద్యాసామగ్రి అందజేస్తున్న చెన్ను వెంకటేశ్వరరెడ్డి



కొండాపురంలో..



వరికుంటపాడులో..

మర్రిపాడు/కొండాపురం/వరికుంటపాడు: మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో పదో తరగతి విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెన్ను వెంకటేశ్వరరెడ్డి పరీక్ష సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. అలాగే కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 35 మంది పదోతరగతి విద్యార్థులకు స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పాదిలి లక్ష్మణ్ పరీక్ష సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం అబ్దుల్ రహీం, స్థానికులు పోలినేని చంద్రబాబు, పాదిలి రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పామూరుకు చెందిన రాజేష్ మెడికల్స్ నిర్వాహకుడు దర్శి రాజేష్ సహకారంతో హెచ్‌ఎం వీరభద్రయ్య పరీక్ష సామగ్రిని అందజేశారు. ఉపాధ్యాయులు వరప్రసాద్, ఉప్పు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన మానవ హక్కుల కమిటీ

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని మానవహక్కుల గరుడవేగా కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. తొలుత మందుల గదిని పరిశీలించి అందులోని కాలపరిమితి తీరినమందులను గుర్తించి పక్కన పెట్టించారు. అనంతరం వైద్యసేవలు అందిస్తున్న తీరుపై రోగులను ఆరాతీశారు. ఆస్పత్రిలోని సమస్యలను సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ శేషారత్నం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎంఓ ఉషాసుందరిను శాలువాలతో సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు కే స్టీఫెన్, నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాల కోటేశ్వరి, కార్యదర్శులు స్వాతి, సలీన, రిజ్వాన, సిబ్బంది వెంకట్రావు పాల్గొన్నారు.

నర్రవాడలో వేలం పాటలు

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో వివిధ హక్కులకు బహిరంగ వేలం పాటలను బుధవారం నిర్వహించారు. నర్రవాడకు చెందిన సంకతాల ప్రభావతి కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయ హక్కును రూ.28.1 లక్షలు, అమ్మవారి చీరలు, రవికలు సేకరణ, విక్రయ హక్కును రూ.7.54 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే పీ సుశీల పొంగళ్ల షెడ్, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చే హక్కును రూ.1.25 లక్షలకు, పత్తి సుబ్రహ్మణ్యం పండ్లు, పూలు విక్రయ హక్కును రూ.4.73 లక్షలు, బాబు పాదరక్షలు భద్రపరుచుకునే హక్కును రూ.12,200కు దక్కించుకున్నారు.

నేడు వెంగమాంబ హుండీల లెక్కింపు

వెంగమాంబ అమ్మవారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు.

యానాదులకు అండగా నిలుస్తాం

దుత్తలూరు: గిరిజన యానాదులకు తమ సంస్థ అండగా నిలుస్తుందని శ్రీవివేకానంద కన్యాకుమారి భారతీయ సాంస్కృతిక అధ్యయన సంస్థ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శ్రీవివేకానంద కన్యాకుమారి భారతీయ సాంస్కృతిక అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో నర్రవాడలో యానాదుల గ్రామ పెద్దల సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్రవాడలోని గిరిజనులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు విద్య, ఆరోగ్యం, తదితర కార్యక్రమాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మేకపాటి మాల్యాద్రినాయుడు, పావులూరి వెంగయ్య, లెక్కల వెంకటరెడ్డి, జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజరు గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై సమీక్ష

జలదంకి: మండల తహసీల్దార్ కార్యాలయంలో జమ్మలపాళెంలోని మెగా లేఅవుట్‌కు సంబంధించిన భూసేకరణపై కావలి ఆర్డీఓ వంశీకృష్ణ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మెగాలేఅవుట్‌కు సేకరించిన 19 ఎకరాలకు సంబంధించి కొందరు రైతులు మాత్రమే ధ్రువీకరణపత్రాలను అందజేశారని తెలిపారు. మరికొందరు భూమి తమదంటే తమదని కోర్టును ఆశ్రయించి ఉన్నారన్నారు. వాస్తవ లబ్ధిదారులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. కోర్టును ఆశ్రయించినవారికి తీర్పు వచ్చిన తరువాత పరిహారం అందజేస్తామన్నారు. తహసీల్దార్ ప్రమీల, డీటీ జూలీబాయి, సీనియర్ అసిస్టెంట్ శ్రీజ పాల్గొన్నారు.